క్లుప్తంగా

సీనియర్ సివిల్ జడ్జి గీతావాణికి ఘన వీడ్కోలు



గీతావాణిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి బదిలీ అయిన సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం సీనియర్ సివిల్ జడ్జి గీతావాణిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయవాదులు, సిబ్బంది తనకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించారన్నారు. జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కరీమ్, ప్రధాన కార్యదర్శి డీఎల్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్, సహాయ కార్యదర్శి బాలసుందరి, కోశాధికారి అబ్దుల్లా, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'మాణిక్యం' ఆవిష్కరణ

పుట్టపర్తి: తెలుగు ఉపాధ్యాయుడు మాణిక్యం మహమ్మద్ ఇసాక్ రచించిన మాణిక్యం శతకంను ఆదివారం బుక్కపట్నం ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించనున్నారు. ఈమేరకు చిత్రావతి సాహితీ కళాపీఠం, సేవా ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి డీఈఓ కిష్టప్ప, డైట్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మునెయ్య, అమర చంద్రబాబుతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన కవులు హాజరవుతారని తెలిపారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందిద్దామని, జాబితాపై అనుమానాలుంటే నివృత్తి చేసుకోవాలని ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు ఇతర సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తప్పులు లేకుండా నిజమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేశామని వాటిని పరిశీలించి రాజకీయ నాయకుల అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం రూరల్: చిగిచెర్ల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. వారి నుంచి రూ.35వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ముగిసిన చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

అమడగూరు: అమడగూరులో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న చౌడేశ్వరీదేవి అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా అమ్మవారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాన్ని ఎప్పటిలానే గాజులపల్లికి చెందిన పలు కుటుంబాల వారు నిర్వహించారు. అమ్మవారిని ఆలయం నుంచి తీసుకొని పురవీధుల్లో ఊరేగిస్తూ గ్రామ నడిబొడ్డులో ఉన్న ఉట్టి వద్ద కొలువుదీర్చారు. అక్కడ భక్తాదులంతా భక్తి శ్రద్ధలతో కొబ్బరికాయలను సమర్పించారు. భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. ఊరేగింపులో మంగళ వాయిద్యాలకు యువకులంతా చిందులేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లికి చెందిన నవీన్‌కుమార్ అనే వ్యక్తిపై ఈ నెల 14న జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులైన కదిరికి చెందిన షేక్ వలిబాషా, ఇర్ఫాన్, బాలమురళీకృష్ణను శనివారం అరెస్ట్ చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు పంపించామని చెప్పారు.

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించండి



మాట్లాడుతున్న సీడీపీఓ సరస్వతి

బత్తలపల్లి: అంగన్‌వాడీ చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలని సీడీపీఓ సరస్వతి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. శనివారం ఈదుల ముష్టూరు గ్రామంలో మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ పక్వాడ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ దేవమణి అధ్యక్షతన నిర్వహించారు. సీడీపీఓ పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పండని తమలపాకు!

- తగ్గిపోయిన ధరలు
- రైతులకు భారంగా మారిన తోటలు
- పెట్టుబడిసాయం అందించాలని కోరుతున్న అన్నదాతలు



చెక్కవారిపల్లిలో సాగులో ఉన్న తమలపాకు తోట

తనకల్లు: అందరి నోరు పండించే తమలపాకు రైతుల కడుపు నింపడం లేదు. ధరలు లేకపోవడంతో తమలపాకు తోటలను సాగు చేస్తున్న అన్నదాతలకు కష్టాలు, కన్నీళ్లే మిగులుతున్నాయి. మార్కెట్‌లో తమలపాకు ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసాలతో తోటలను సాగు చేస్తే చివరకు ధరలు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టతరంగా మారిందని వాపోతున్నారు. దీంతో తమలపాకు తోటల సాగు భారంగా మారిందని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

తోటలే జీవనాధారం..

మండలంలోని ఎగువ, దిగువ చెక్కవారిపల్లిలో కలిపి మొత్తం 370 కుటుంబాలున్నాయి. ఇందులో దాదాపు 70 శాతం అంటే 200లకు పైగా కుటుంబాలకు తమలపాకు తోటల సాగే జీవనాధారం. మిగిలిన కుటుంబాల వారు కూడా చాలా వరకు తోటల్లోనే కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రతి కుటుంబం అర ఎకరం నుంచి రెండు ఎకరాల వరకు తమలపాకు తోటలను సాగు చేస్తున్నారు. రెండు గ్రామాల్లో సుమారు 150 ఎకరాల వరకు తోటలు సాగులో ఉన్నాయి. ఒక ఎకరాలో తోట సాగు చేయడానికి అన్ని ఖర్చులు కలిపి ఏడాదికి రూ.లక్షకు పైగానే పెట్టుబడి అవసరం అవుతుందని రైతులంటున్నారు. సాధారణంగా నెలకు ఒకసారి ఆకులను కోత కోస్తారు. ఇక్కడ పండిన తమలపాకులను అన్నమయ్య జిల్లా మదనపల్లి, పుంగనూరు, తిరుపతి, కర్ణాటక లోని చింతామణి, బాగేపల్లి, శ్రీనివాసపురం తదితర మార్కెట్‌లకు తరలించి విక్రయిస్తారు. మరి కొందరు వ్యాపారులు ముందుగానే ఆర్డర్లు ఇచ్చి కొనుగోలు చేస్తారు. మార్కెట్‌లో నెల రోజుల క్రితం వరకు ఒక మోపు(100 కట్టలు) తమలపాకుల ధర రూ.12 వేల నుంచి రూ.14 వేలు వరకు పలికిందని, అయితే ప్రస్తుతం మార్కెట్లో మోపు ధర కేవలం రూ. 3 వేలు నుంచి రూ. 4 వేలకు పడిపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ధరలు ఒక్కసారిగా పతనమవ్వడంతో పంటకు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదంటున్నారు.

ప్రభుత్వం సాయం ఏదీ...?

తోటల పెంపకానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి పెట్టుబడి సాయం అందడం లేదని, దీంతో వడ్డీలకు అప్పులు తెచ్చి పంటను సాగు చేసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తరచూ తోటలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందించడం లేదు. గాలీవానలకు తోటల్లో పడిపోయిన తీగలను ఎత్తి కట్టేందుకు కావాల్సిన వెదురు కర్రలు కొనేందుకు, కూలీల ఖర్చులకు కొత్త అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలను మంజూరు చేయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తోటల సాగు భారం



చాలా కాలంగా మా కుటుంబానికి తమలపాకు తోట సాగే జీవనాధారం. మేము రెండు ఎకరాలలో తోటను సాగు చేశాం. ఎరువుల పేడ, కూలీల అవసరం ఎక్కువగా ఉంటుంది. శ్రమ, ఖర్చులు అధికం. మూడు నెలలు మాత్రమే ధరలు ఉంటాయి. ఆ తరువాత ఉండవు. దీంతో పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం లేదు. ఏడాది తర్వాత పంట మార్చాలి. దీనికి అదనపు ఖర్చు వస్తుంది. తమలపాకు పంట సాగు చాలా భారంగా మారింది.

– శ్రీనివాసులు, తమలపాకు రైతు, డీ. చెక్కవారిపల్లి, తనకల్లు

ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయమూ లేదు



ఏటా తుపాన్, అకాల వర్షాలు, గాలులకు తోటలు పడిపోతున్నాయి. మళ్లీ తోటను పెంచాలంటే రూ.50 వేలకు పైగా ఖర్చు అవుతోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం రావడం లేదు. దీంతో అప్పులు చేయాల్సి వస్తోంది. తమలపాకు రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలి.

– తిమ్మన్న, రైతు, డీ. చెక్కవారిపల్లి, తనకల్లు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఏడీఎఫ్ఓ నాగరాజునాయక్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రిలో సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నాగరాజునాయక్ మాట్లాడుతూ గ్యాస్, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ తదితర ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: అగ్ని ప్రమాదాలు జరగకుండా ఆసుపత్రుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి రాజు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని స్పందన ఆసుపత్రిలో సిబ్బంది, యాజమాన్యానికి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్పందన ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఇంచార్జ్ ఫైర్ ఆఫీసర్ ఎస్ శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి, త్రివేణి ఆస్పత్రిలో సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు.

'ఉపాధి' కూలీల బిల్లులు చెల్లించండి



ఏఓ షామీర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండలంలోని వై. కొత్తపల్లిలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల బిల్లులు చెల్లించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అధికారులను కోరారు. ఈమేరకు శనివారం ఆయన నాయకులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ షామీర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్‌పాళెం గ్రామంలో నిరుపయోగంగా ఉన్న రైతు సేవ కేంద్రం, సచివాలయ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వరిగిరెడ్డిపల్లిలో వ్యవసాయానికి రాత్రి పూట విద్యుత్ సరఫరా చేస్తున్నారని, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, జంగాపల్లి పెద్దన్న, నేతలు శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వనభోజనాలు



శ్రీరాముని చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

ధర్మవరం రూరల్: చిగిచెర్ల గ్రామంలో శనివారం వన భోజనాలు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే శ్రీరాముని చిత్ర పటంతో పాటు గ్రామస్తులు నిత్యావసరాలను గంపలో ఉంచుకుని గ్రామం వెలుపలకు వెళ్లారు. బావులు, వనంలో భోజనాలు చేసుకున సాయంత్రందాకా అక్కడే గడిపారు. సాయంత్రం స్వామివారి చిత్ర పటాన్ని ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకొచ్చారు. వనభోజనంతో గ్రామానికి మంచి జరుగుతుందని గ్రామపెద్దలు శివారెడ్డి, సుబ్బప్పగారి ఓబిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు తెలిపారు.

ప్యాదిండిలో..



వంట చేస్తున్న మహిళలు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్యాదిండి గ్రామస్తులు శనివారం వనభోజనాలకు తరలివెళ్లారు. ఉదయాన్నే గ్రామస్తులందరూ సమీపంలోని పొలాల్లోకి వెళ్లి, వంటలు చేశారు. బంధుమిత్రులతో కలసి సంతోషంగా ఆరగించారు. ఊయల్లో ఆడుతూ పాడుతూ సంతోషంగా గడిపారు. సాయంత్రం దేవాలయంలో పూజలు చేసిన అనంతరం గ్రామంలోకి ప్రవేశించారు.

మహిళ అదృశ్యం

కదిరి అర్బన్: బాలప్పగారిపల్లి క్వార్టర్స్‌కు చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. కాలనీకి చెందిన విశ్వనాథ్ భార్య ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ఆచూకీ లభించలేదు. విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు శనివారం రూరల్ అప్‌గ్రేడ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నంకు చెందిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన మస్తాన్ బీకి మతిస్థిమితం సరిగా లేదు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ఆచూకీ లభించలేదు. వృద్ధురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి



ముస్లింలు రిలే దీక్షలకు మద్దతు తెలిపిన సీపీఐ నాయకులు

ధర్మవరం: వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్ తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ముస్లింలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు శనివారం సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టేలా రాజకీయాలు చేస్తే మాత్రం సహించేది లేదన్నారు. ముస్లింలకు న్యాయం జరిగేంత వరకు సీపీఐ తరఫున పోరాటం చేస్తామన్నారు. రిలే దీక్షలకు బీఎస్పీ ఇన్‌చార్జ్ సాకే వినయ్‌కుమార్, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర మద్దతు తెలిపారు. చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గుర్రం వెంకటస్వామి, ఆదినారాయణ, మహిళా సమాఖ్య నేతలు లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ, ప్లంబర్స్ ఎలక్ట్రీషియన్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆర్గనైజేషన్ కార్యదర్శి ఆంజనేయులు, తాజుద్దీన్, రామకృష్ణ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

బత్తలపల్లి: ఈదుల ముష్టూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. తొలిరోజు కలశస్థాపన, గంగపూజ, గణపతి ప్రార్థన, గోవు ఆరాధన పూర్వక యాగశాల ప్రవేశం, మహాగణపతి పూజ, స్వస్తిపుణ్యాహవచనం తదితర పూజలుంటాయన్నారు. ఈనెల22న వివిధ హోమాలు, జపాలు, ధాన్య, శయ్యాధివాసం, స్వామివార్ల విగ్రహ గ్రామోత్సవం ఉంటుందన్నారు. 23న కలశారాధన, యంత్ర ప్రాణ ప్రతిష్ట, విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరుగుతుందన్నారు. అనంతరం అన్నదానం జరుగుతుందన్నారు. అదే రోజు రాత్రి 8 గంటలకు బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు.


ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యం, ద్విచక్రవాహనాన్ని చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

హిందూపురం టౌన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ మేరకు శనివారం ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ లక్ష్మీదుర్గయ్య వివరాలను వెల్లడించారు. చిలమత్తూరు మండలంలోని మోరసలపల్లికి చెందిన రామాంజి, హిందూపురం పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన మంజుల, మారు కర్ణాటక మద్యం తరలిస్తుండగా మూడు కేసులు నమోదు చేశామన్నారు. వారి నుంచి 205 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీన చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐలు ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుల్స్ నరసింహ, వెంకటేష్, సతీష్, కానిస్టేబుళ్లు అంజి, సురేష్, కుమార్, రంగదామా, శివ, సుధాకర్ రెడ్డి, ఉష్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ఎలక్ట్రానిక్ వస్తువులను చెత్త ట్రాక్టర్‌లోకి వేస్తున్న ఆర్డీఓ మహేష్, కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేస్ట్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ పనికిరాని సామగ్రిని సేకరించి డంప్ యార్డ్‌లో ప్రత్యేకమైన ఓ గదిలో భద్రపరుస్తామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్యాసర్, కేశవ, మేస్త్రీలు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చిట్టెమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అధ్యాపకులు కిరణ్‌కుమార్, త్రివేణి, షమీవుల్లా, పావని, భువనేశ్వరి, హైమావతి, పుష్ప, సరస్వతి, ఆనంద్, మీనా, ధనుంజయ, ఎస్.సరస్వతి, నల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అంజినప్ప, ఈఓపీఆర్డీ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. పరిశుభ్రతకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. స్థానిక సర్పంచ్ ఆంజినమ్మ, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల స్థాయి అధికారులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి పారిశుధ్యంపై ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ బాబురావు, ఈఓఆర్డీ సునిత, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడిమర్రి: స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో శనివారం మండల కేంద్రంలో విద్యార్థులు, మండల అధికారులు, పారిశుధ్య కార్మికులు ర్యాలీ చేపట్టారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను (ఈ వేస్ట్) వీధుల్లో పడేయకండని ఎంపీడీఓ వెంకట రంగారావు, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ఈఓఆర్డీ విజయ్ శేఖర్‌నాయుడు, ఎంఈఓ కృష్ణమోహన్, ఏపీఓ అనిల్‌రెడ్డి, ఏపీఎం సాంబశివుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని డీఎల్‌పీఓ శివకుమారి, ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీఓ అధ్యక్షతన విద్యార్థులతో ర్యాలీ, ప్రతిజ్ఞ, గ్రామసభ నిర్వహించారు ఉప సర్పంచు కోటి గోపీనాథ్, ఈఓఆర్డీ క్రిష్టప్ప, పరిపాలన అధికారి శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ చేపట్టారు. మానవహారం ఏర్పాటు చేసి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు మొక్కలు నాటారు. ఎంపీడీఓ రఘునాథ గుప్తా, డీటీ రవి నాయక్, ఏఓ రామక్రిష్ణ, ఈఓఆర్డీ శకుంతల, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, ఆర్ఐ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను కాపాడుదాం

కనగానపల్లి: పరిసరాలను పరిశుభ్రతను కాపాడినపుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లిలో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్థానిక పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ భాస్కర్, ఎంఈఓ శ్రీదేవి, ఏపీఎం హేమలత, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.


గ్రంథాలయ ఆవరణలో చెత్త తొలగింపు

చెన్నేకొత్తపల్లి: స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని పౌరశాఖ గ్రంథాలయ ఆవరణను శుభ్రం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జయరాం, పాఠకులు నారాయణ స్వామి, నరసింహులు, ఆంజనేయులు, మాదన్న, రామలక్ష్మమ్మ, ముత్యాలమ్మ, కోనమ్మ, నాని తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: మండల కేంద్రంలో శనివారం ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది, వెలుగు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలో ఉన్నతపాఠశాల విద్యార్థులతో కలిసి అధికారులు శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బేల్దారి మృతి



మృతుడు ఆంజనేయులు

ధర్మవరం అర్బన్: లక్ష్మీచెన్నకేశవపురంలోని బ్రహ్మంగారి ఆలయ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బేల్దారి మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని మహాత్మాగాంధీనగర్‌కు చెందిన బేల్దారి ఎం.ఆంజనేయులు(50) రెండురోజుల క్రితం తాడిమర్రికి బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం తిరిగి ధర్మవరానికి బైక్‌పై బయలుదేరాడు. పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవపురంలోని బ్రహ్మంగారి పాలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో తలకు, గొంతు వద్ద తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య సరోజమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ హేమంత్‌కుమార్, వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నామని సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

యువకుడి దుర్మరణం

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందాడు. కియా స్టేషన్ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నెకొత్తపల్లి మండలం చిన్నపల్లికి చెందిన కురుబ మల్లేష్ (21) కియా కార్ల కంపెనీ అనుబంధ పరిశ్రమ అయిన అనంత టెక్‌లో పనిచేస్తున్నాడు. శనివారం మిత్రుడు సురేష్‌తో కలసి ద్విచక్ర వాహనంలో అమ్మవారిపల్లికి బయల్దేరాడు. మార్గం మధ్యలో గుట్టూరు శివారులోని బన్నీ రెస్టారెంట్ వద్దకు రాగానే పెట్రోల్ కోసమని రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుంచి అనంతపుం వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను స్థానికులు 108 వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆస్పత్రికి పంపించారు. కియా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.